క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 13, వంకాయ 18, బెండ 23, పచ్చిమిర్చి 28, కాకర 18, బీర 18, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 35, దొండ 13–18, చిక్కుడు 45, గోకర 23, బీట్‌రూట్ 20, క్యాప్సికం 28, ఆలు 21, దోస 23, సార 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రోడ్ల మరమ్మతుకు చర్యలు: లచ్చిరెడ్డి



ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్ క్రిస్టల్ ఎవెన్యూ కాలనీలోని రోడ్లు వర్షాలకు గుంతలమయంగా మారిందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టి తీసుకెళ్లారు. దీంతో గురువారం కాలనీవాసులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, సురేష్ బాబు, విష్ణువర్ధన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ హెల్త్ క్యాంప్స్ కన్వీనర్‌గా డా.శ్రీదేవిగౌడ్



శ్రీదేవిగౌడ్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న భీమ్‌రెడ్డి

మలక్‌పేట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హెల్త్ క్యాంప్స్ హైదరాబాద్ జిల్లా బ్రాంచి కన్వీనర్‌గా మూసారంబాగ్‌కు చెందిన డాక్టర్ బక్క శ్రీదేవి గౌడ్ నియమితులయ్యారు. సొసైటీ జిల్లా బ్రాంచ్ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం నియామకం ఉత్తర్వులు తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా పేదలకు మరింతగా వైద్య సేవలు చేయడానికి అవకాశం కల్పించిన సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. పేదల ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంప్‌లు విస్తృత పరుస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుల నియామకం

మలక్‌పేట: మలక్‌పేట నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఆరు డివిజన్లకు కొత్తగా అధ్యక్షులను నియమించినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్‌గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సైదాబాద్ డివిజన్‌కు బి.చక్రపాణి, మూసారంబాగ్‌కు లింగాల శ్రీనివాస్‌గౌడ్, ఓల్డ్ మలక్‌పేటకు మహ్మద్ షకీల్, అక్బర్‌బాగ్‌కు మహేష్, ఆజంపురాకు రాహుల్‌సింగ్, చవునికి నూర్ మహ్మద్ ఖాన్ అధ్యక్షులుగా నియమితులయ్యారన్నారు. కొత్త అధ్యక్షులు బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కిషన్ కోరారు.

అధికారుల తీరు మారదు... పాలకవర్గం పట్టించుకోదు !

● మార్కెట్‌లో ప్రజాధనం వృథా

చాదర్‌ఘాట్: మార్కెట్ ఆదాయ లక్ష్యాలు సాధించడంపై అధికారులు, తమ స్వలాభాలు చూసుకోవడానికి పాలకవర్గం సభ్యులు ప్రాధాన్యం ఇస్తున్నారు తప్ప మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌లోని సమస్యల పరిష్కారం, వసతుల కల్పనపై మాత్రం దృష్టి పెట్టడంలేదు. మార్కెట్‌కు వెన్నముక లాంటి రైతులు, వినియోగదారులు, వ్యాపారులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వారు విఫలమౌతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథాగా మారుతోంది. దీనికి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన చింతపండు షెడ్డు నిదర్శనంగా నిలుస్తోంది. రెండేళ్ల క్రితం నిర్మించిన ఈ షెడ్డును అప్పట్లో అధికారులు, పాలకవర్గం వారు రాష్ట్ర హోంమంత్రిచే అట్టహాసంగా ప్రారంభింపజేశారు. ఆ తర్వాత దానిని పట్టించుకోవడం మానేశారు. దాంతో షెడ్డు ప్రాంగణం మొత్తం చెత్తకుప్పలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు స్పందించి చింతపండు షెడ్డు పరిసరాలను శుభ్రం చేసి దానిని వాడుకలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన చింతపండు షెడ్డు

జయకృష్ణా ముకుందా మురారీ

సందడిగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పాతూరి నిర్విన్‌గౌడ్, సౌంత్‌ఎండ్ పార్కు కాలనీ



కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ఎల్బీనగర్ జోన్ బృందం: ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికలు, రాధ వేషధారణలో అలంకరించారు. పలు పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమిని నిర్వహించారు. గోకుల కృష్ణా...గోపాల కృష్ణ మాయలు చాలయ్యా... వే వేల గోపెమ్మల.. మువ్వగోపాలుడే అంటూ బుడి బుడి నడకలతో చిన్నారి గోపికలు చిన్నారి శ్రీకృష్ణుల చుట్టూ చేరి ఆట పట్టించిన తీరు ఆహుతులను కట్టి పడేశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పోటీ పడుతూ ఉట్టి కొట్టి సందడి చేశారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో...

నాగోలులోని వేణుగోపాల స్వామి ఆలయంలో చైర్మన్ చింతల సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగా రెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉయ్యాలలో వేసి భక్తులు పాటలు పాడుతూ ఉయ్యాల ఊపారు. అనంతరం అన్నదానం చేశారు.



గ్రీన్‌హిల్స్ కాలనీలో..



ఎల్బీనగర్ అక్షర స్కూల్‌లో ఉట్టి కొడుతున్న ఉపాధ్యాయులు



నాగోలులో పూజలు చేస్తున్న కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్



కొత్తపేటలో..



కుంట్లూర్‌లో..

రూ.3 కోట్లతో ట్యాంక్ బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహం



సాహెబ్‌నగర్‌లో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

లింగోజిగూడ: మహోన్నత వ్యక్తుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, చరిత్రను వక్రీకరించి దాచితే దాగదని, ఎప్పటికైనా బయటకు వస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని గురువారం ఆయన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ఎంతో మంది మహనీయుల చరిత్రను బయటకు రాకుండా చేశాయని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ వారి చరిత్రను బయటకు తీశారన్నారు. వారి విగ్రహాలను ఏర్పాటు చేసి, జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. త్వరలో రూ.3 కోట్లతో ట్యాంక్ బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కుల సాధన కోసం సర్వాయి పాపన్నగౌడ్ గోల్కొండ కోటపై దండెత్తి గెలిచారన్నారు. రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని బహుజనుల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మన దగ్గర లేని పాపన్న గౌడ్ చరిత్ర లండన్‌లో ఉందన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సమన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కుంట్లూర్ వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్, బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు కొత్త రాంమహేశ్వర్‌గౌడ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, వెంకన్న గౌడ్, ఆంజనేయగౌడ్, భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ చదివేందుకు సాయం చేయండి

● అనాథ విద్యార్థి వేడుకోలు



దాసరి మహంకాళి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహంలో ఉండే అనాథ విద్యార్థి దాసరి మహంకాళికి ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. కానీ, కళాశాలలో చేరేందుకు అవసరమైన ఫీజు డబ్బులు లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. వివరాలు.. జగిత్యాల జిల్లా, గొల్లపల్లి మండలం రంగదామునిపల్లికి చెందిన దాసరి మహంకాళికి చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. చదువుకోవాలనే తపన ఉన్నా..ఆదరణ, స్తోమత లేక నిస్సహాయ స్థితిలో ఇతడికి హైదరాబాద్ ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహం 2017లో అమ్మలా ఆశ్రయం కల్పించింది. ఇంటర్మీడియేట్ నవీన జూనియర్ కాలేజీలో ఉచితంగా సీటు ఇవ్వగా, 84 శాతం మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. తర్వాత కొన్ని కోచింగ్ సెంటర్లు ఉచితంగా కోచింగ్ ఇవ్వగా, కష్టపడి చదువుకొని 2023లో నీట్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్ష రాసి మంచి ర్యాంక్ తెచ్చుకున్నాడు. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ వచ్చింది. అయితే, ఐదేళ్ల ఎంబీబీఎస్ చదువు కోసం రూ. 4,11,200 ఖర్చు అవుతుందని, అనాథనైన తనకు అంత ఆర్థిక స్తోమత లేదని విద్యార్థి దాసరి మహంకాళి తెలిపాడు. సీటు రిజర్వ్ చేసుకోవడానికి ఈ నెల 7వ తేదీ లోపు రూ. 41 వేలు కట్టాలని చెప్పాడు. దాతలు తనకు ఆర్థిక సాయం చేసి ఎంబీబీఎస్ చదువుకొని వైద్యుడిగా ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. ఇతర వివరాలకు 9985720394లో సంప్రదించాలని కోరాడు.

కస్తూరినగర్‌లో ‘ మేరా మిట్టీ– మేరా దేశ్’




అమృత కలశంతో మట్టిని సేకరిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: బీజేపీ చేపట్టిన మేరా మిట్టీ– మేరా దేశ్ ప్రచారోద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశరాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మించేందుకు అవసరమైన మట్టిని సేకరించేందుకు ప్రధాని మోదీ పిలుపు మేరకు గడపగడపకూ బీజేపీ శ్రేణులు తిరుగుతున్నాయని ఆయన అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కస్తూరినగర్ కాలనీలో అమృత కలశ్ యాత్రను రంగారెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా గడగడపకూ వెళ్లి అమృత కలశంతో మట్టిని సేకరించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, శాంతిమిత్ర, రాజవర్ధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్,శశిధర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, జీవన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మల్లేష్‌యాదవ్, రాఘవ, గోవర్ధన్ పాల్గొన్నారు.

మధుయాష్కీని కలిసిన చంపాపేట నాయకులు

చంపాపేట: తెలంగాణా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్‌ను గురువారం చంపాపేట డివిజన్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకులు కోయలకొండ సునీల్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం సునీల్ మాట్లాడుతూ.. రాబోయే శాసన సభ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం మధుయాష్కీకి అవకాశం కల్పిస్తే తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ నాయకులు గ్యారల శ్రీకాంత్, ఉమేష్, నరేందర్, కిరణ్‌కుమార్, భార్గవచారి, సంతోష్, అభిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మధుయాష్కీ గౌడ్‌తో కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఉదయనిధి స్టాలిన్‌పై చర్యలు తీసుకోవాలి

కాచిగూడ: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు, రాష్ట్ర క్రీడా, యువజన శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై కఠిన తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్ లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సిటి సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కాచిగూడలోని భజరంగ్ సేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హిందువుల మనోభావాలను కించపరిచిన ఉదయనిధి స్టాలిన్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉదయనిధిని తక్షణమే బర్తరఫ్ చేయాలన్నారు.

సనాతన ధర్మాన్ని కరోనాతో పోల్చడం దారుణమని, దీనికి సీఎం స్టాలిన్ నైతిక బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో భజరంగ్ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజని, నేతలు నందకిషోర్ అగర్వాల్, సూర్య శుక్లా, మనోజ్, నరేష్, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాకుత్‌పురాలో దళితులకు అవకాశం ఇవ్వాలి



బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న జనపాల మధు



టికెట్ కోసం దరఖాస్తు చేసిన సహదేవ్‌యాదవ్

సైదాబాద్: యాకత్‌పురా నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఈసారి దళిత నాయకులకు బీజేపీ అధిష్టానం అవకాశం ఇవ్వాలని ఎస్సీమోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ జనపాల మధు కోరారు. గురువారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో యాకుత్‌పురా టికెట్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 15 ఏళ్లుగా ఎస్సీ మోర్చా నాయకుడిగా పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న దళిత నాయకుడిని అయిన తనకు పార్టీ అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు నాగరాజు, గౌతం, ప్రదీప్ పాల్గొన్నారు.

సీనియర్లకు అవకాశమివ్వాలి: సహదేవ్‌యాదవ్

పార్టీలో సీనియర్లకు టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇచ్చి పోటీకి అవకాశం కల్పించాలని బీజేపీ సీనియర్ నాయకుడు సహదేవ్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన యాకుత్‌పురా నియోజకవర్గ టికెట్ కోసం పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఎంతో కాలంగా పార్టీలోనే ఉంటూ పార్టీ ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన సీనియర్ నాయకుడిగా తనకు పార్టీ టికెట్ కేటాయించాలని ఆయన కోరారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

చాదర్‌ఘాట్: రాబోయే వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ సూచించారు. గురువారం ఓల్డ్‌మలక్‌పేట సిమ్లా గార్డెన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఏసీపీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో పీస్ కమిటీ సభ్యుల పాత్ర అమోఘమన్నారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాల నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ, ట్రాన్స్‌కో, వాటర్‌వర్క్స్, మెట్రో అధికారులు, సిబ్బంది వేడుకల సమయంలో సహకరించాలని అన్నారు. మండపాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వాలని ఏసీపీ సూచించారు. సమావేశంలో చాదర్‌ఘాట్ సీఐ ప్రకాష్‌రెడ్డి, ఎస్సైలు కృష్ణంరాజు, భరత్, తిరుపతి, పీస్ కమిటీ సభ్యులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, జాఫర్, రాజేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏసీపీ శ్యాంసుందర్ తదితరులు

అంతర్గత రహదారులనూ ఆధునీకరిస్తాం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులను సైతం ఆధునీకరిస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పవన్‌పురి కాలనీలోని అంతర్గత సీసీరోడ్డు నిర్మాణ పనులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఐఎస్‌సదన్‌లో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణ హామీని సీఎం నిలబెట్టుకోవాలి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బత్తిన సుధాకర్ మాదిగ తదితరులు

నాగోలు: ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా మాదిగల ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణకు ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలి మహాజన సోషలిస్టు పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తిన సుధాకర్ మాదిగ కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వర్గీకరణ జరిగేందుకు సహకరించాలని గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లి సీఎం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహాజన పార్టీ ఎల్‌బీనగర్ కార్యదర్శి ప్రకాష్ మాదిగ, డివిజన్ నాయకులు శేఖర్ రాజు , నాగరాజు, సాయి చరణ్, రాజు, మౌలాలి, రంగన్న, రాములు, యాదయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం: జక్కిడి

నాగోలు: నాగోల్ డివిజన్‌లో ఏ కాలనీలో చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని, సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజాచైతన్యం, ప్రతి డివిజన్ లో సమస్యల పరిష్కారం కోసం గురువారం ఆయన ప్రజా చైతన్య పాదయాత్రను చేపట్టారు. నాగోలు చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుదీర్ రెడ్డివి మాటలే తప్ప చేతలు లేవన్నారు. డివిజన్ పరిధిలోని నాగోల్, బండ్లగూడ ఫతుల్లాగూడ, చెరువుల సుందరీకరణ పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. రానున్న రోజుల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేస్తామని, ప్రతి కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాగోల్, బండ్లగూడ, ఆనంద్‌నగర్, మల్లికార్జున నగర్, అయ్యప్ప కాలనీ, చాణిక్యపురి, వెంకటరమణ కాలనీ తదితర కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నాగోలు చౌరస్తాలో ప్రభాకర్‌రెడ్డి ప్రజాచైతన్య పాదయాత్రకు హారతి పలుకున్న మహిళలు

బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థిత్వానికి ‘కొప్పుల’ దరఖాస్తు



బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు అందజేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిత్వానికి జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి గురువారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, 1995 నుంచి క్రియాశీలంగా ప్రత్యక్ష రాజకీయాలతో ప్రజా సేవ చేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధిగా ప్రతిపక్షంలో ఉండి ప్రజల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్నామన్నారు. 2009లో గ్రేటర్ కార్పొరేటర్‌గా తన భార్య కొప్పుల లత ఎన్నికయ్యారని, 2016లో తాను కార్పొరేటర్‌గా పోటీ చేసి పరాజయం సాధించినప్పటికీ ప్రజల పక్షాన పోరాటం చేయడంతో 2019 ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించామన్నారు. బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయటానికి తనకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీశ్‌రెడ్డి, కవితారెడ్డి, మాధవి, కడారి యాదగిరియాదవ్, మహేష్, ముత్యంరెడ్డి, రాఘవేందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.